ములుగు మెరిసేలా..



- పట్టణ సుందరీకరణకు ప్రణాళిక
- మంత్రి సీతక్క సూచనతో కదిలిన యంత్రాంగం
- హెచ్‌ఎండీఏ అధికారుల పర్యవేక్షణలో యాక్షన్ ప్లాన్
- గట్టమ్మ నుంచి జంగాలపల్లి దాకా..
- కూడళ్లు, ప్రధాన రోడ్ల అభివృద్ధి
- పచ్చదనం ఉట్టిపడేలా చర్యలు

ములుగు, జూలై 30: ములుగు.. అభివృద్ధి దిశగా పయనిస్తోంది. అంచెలంచెలుగా పురోగమనం చెందుతోంది. గ్రామ స్థాయి నుంచి పట్టణంగా పురోగతి సాధిస్తోంది. ఐదేళ్ల క్రితం జిల్లా కేంద్రంగా ఏర్పడిన ములుగు తాజాగా మునిసిపాలిటీగా గుర్తింపు పొందింది. రాష్ట్ర మంత్రి సీతక్క చొరవతో దీని సుందరీకరణకు యంత్రాంగం ముందడుగు వేసింది. ఇందులో భాగంగా హెచ్‌ఎండీఏ అధికారుల పర్యవేక్షణలో యాక్షన్‌ప్లాన్ సద్ధమవుతోంది. మెట్రో సిటీలకు తగ్గకుండా పచ్చదనం, లైటింగ్‌తో అందంగా తీర్చిదిద్దేందుకు కసరత్తు చేస్తున్నారు.

గట్టమ్మ, జంగాలపల్లి వద్ద తోరణాలు

ములుగు పట్టణ కీర్తి కిరీటంగా భావించే గట్టమ్మ తల్లి దేవాలయం నుంచి జంగాలపల్లి క్రాస్‌రోడ్డు వరకు 163 జాతీయ రహదారిని అభివృద్ధి చేయనున్నారు. ఏడు కిలోమీటర్ల పొడవునా డివైడర్ మధ్యలో చెట్లు, పూల మొక్కలను పెంచనున్నారు. గట్టమ్మ ఆలయం వద్ద స్వాగత తోరణం, జంగాలపల్లి క్రాస్‌రోడ్డులోని కూడలిలో రామప్ప దేవాలయాన్ని ప్రతిబింబిస్తూ పూల మొక్కలతో అలంకరణ చేయనున్నారు. గట్టమ్మ పరిసరాల్లో గతంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో మినీ పార్కును ఏర్పాటు చేయగా మహాజాతర సమయంలో చేపట్టిన అభివృద్ధి పనులతో దానిని తొలగించారు. ఇప్పుడు మళ్లీ స్మృతివనం ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించారు.

కూడళ్లలో పచ్చదనం

ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, మసీదు, ఆర్టీసీ బస్టాండు, పీఆర్ కార్యాలయ కూడళ్లను అభివృద్ధి జాబితాలో చేర్చారు. పచ్చిక గడ్డి, పూలమొక్కలు, మహనీయుల విగ్రహాలు, 'ఐ లవ్ ములుగు' అని రాసి ఉన్న థీమ్‌లతో అలంకరించనున్నారు. ఇప్పటికే పీఆర్ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు రోడ్డు పక్కన ఎండిన భారీ వృక్షాలను తొలగించే ప్రక్రియ పూర్తయ్యింది.

హెచ్‌ఎండీఏ అధికారుల ఫీల్డ్ విజిట్

ములుగు సుందరీకరణ బాధ్యతను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ)కి అప్పగించారు. హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా ఉన్న సర్ఫరాజ్ అహ్మద్ గతంలో ములుగు సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. ఈపరిణామం జిల్లా కేంద్రం అభివృద్ధికి అనుకూలాంశంగా మారింది. ఆలేరు నుంచి ఘట్కేసర్ వరకు ఉన్న గ్రీన్‌ఫీల్డ్ హైవే బ్యూటిఫికేషన్‌ను పర్యవేక్షిస్తున్న అధికారులు ఇటీవల ములుగుకు వచ్చారు. సుందరీకరణకు ఎంపిక చేసిన ప్రదేశాలను పరిశీలించారు.

సెంట్రల్ లైటింగ్.. డివైడర్లు

ములుగులోని ప్రధాన రోడ్లను అభివృద్ధి జాబితాలో చేర్చారు. డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నుంచి జీవంతరావుపల్లి క్రాస్‌రోడ్డు వరకు దారిని విస్తరించి సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రపంచ వారసత్వ సంపదగా రామప్ప యునెస్కో గుర్తింపు పొందిన తర్వాత రానున్న రోజుల్లో ములుగు, బండారుపల్లి నర్సాపూర్ మీదుగా రామప్పకు వెళ్లేందుకు ఈ రూట్‌ను ప్రత్యామ్నాయంగా ఎంపిక చేశారు. ఈనేపథ్యంలో ఈ దారిని సుందీకరిస్తే వచ్చిపోయే పర్యాటకులను ఆకట్టుకునే వీలుంది. ఇదే క్రమంలో పత్తిపల్లి రోడ్డు, శివాలయం వీధి, మసీదు నుంచి గొల్లవాడ వరకు రోడ్లను అభివృద్ధి చేస్తారు. రోడ్డు, డ్రెయినేజీ విస్తరణకు ఉన్న అడ్డంకులను అధిగమించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ములుగు శివారులోని తోపుకుంటను గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయాలనే ప్రయత్నం అమలు కాలేదు. కట్ట విస్తరణ, బతుకమ్మ ఘాట్‌ల నిర్మాణంతోనే సరిపుచ్చారు. ములుగు సుందరీకరణ ప్రాజెక్టులో తోపుకుంటను కూడా చేర్చి పార్కు, థీమ్‌లతో అభివృద్ధి చేయడంతో పాటు కుంటలో బోటింగ్ సౌకర్యం కల్పిస్తే పట్టణ ప్రజలకు, పర్యాటకులకు ఎంతో ఆహ్లాదకరంగా మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ములుగును అందంగా తీర్చిదిద్దుతాం : సీతక్క రాష్ట్రమంత్రి

ములుగును సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతోంది. చారిత్రక, భౌగోళిక ప్రత్యేకతలు కలిగిన జిల్లాకు కేంద్రంగా ఉన్న ములుగును నగరాలకు తీసిపోకుండా అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. అవసరమైనన్ని నిధులను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయిస్తాం.



పూలమొక్కలు, పచ్చని చెట్లతో అభివృద్ధి చేయనున్న హైవే డివైడర్



పంచాయతీ అధికారులతో కలిసి జంగాలపల్లి వద్ద కూడలిని పరిశీలిస్తున్న హెచ్‌ఎండీఏ అధికారి (ఫైల్)

భూపాలపల్లి డీడబ్ల్యూవోగా చెన్నయ్య



కలెక్టర్ రాహుల్‌శర్మకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీడబ్ల్యూవో చెన్నయ్య

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూలై 30: స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి (డీడబ్ల్యూవో)గా చెన్నయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన నాగేశ్వరరావు ఈనెల 27న రిటైరయ్యారు. దీంతో భూపాలపల్లి సీడీపీవోగా పని చేస్తున్న సి.హెచ్. అవంతికి ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో మంచిర్యాల జిల్లాలో డీడబ్ల్యూవోగా పనిచేస్తున్న చెన్నయ్య బదిలీపై జిల్లాకు వచ్చారు. జిల్లా ఆవిర్భావంతో తొలి డీడబ్ల్యూవోగా చెన్నయ్య ఇక్కడే పనిచేశారు. 2016 నుంచి 2019 వరకు కొనసాగారు. మళ్లీ ఆయన భూపాలపల్లి డీడబ్ల్యూవోగా వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ రాహుల్ శర్మను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

గోదావరి ఉగ్రరూపం

కాళేశ్వరం వద్ద భారీ ప్రవాహం



కాళేశ్వరం పుష్కరఘాట్ మెట్లను తాకుతూ ప్రవహిస్తున్న గోదావరి

మహదేవపూర్, జూలై 30: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని ముక్తీశ్వర త్రివేణి సంగమ గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలకు ప్రాణహిత ఉప్పొంగడంతో కాళేశ్వరం వద్ద ఇటు గోదావరి, అటు ప్రాణహిత ఉగ్రరూపం దాలుస్తోంది. ఇప్పటి వరకు 11.400 మీటర్ల నీటి ప్రవాహం ఉండటంతో మెట్ల వరకు గోదావరి ప్రవహిస్తోంది. త్రివేణి సంగమం వద్ద భారీ వరద చేరింది. దీంతో గత 15 రోజులుగా మెట్ల వద్దనే ఉన్న గోదావరి తాజాగా మంగళవారం మెట్లు దాటి రావడంతో ప్రయాణికులు, కాళేశ్వర ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

పెరుగుతున్న గోదావరి

ఏటూరునాగారం రూరల్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద ప్రవాహం పెరిగింది. మంగళవారం 7 గంటలకు గోదావరి నీటిమట్టం 14.430 మీటర్లు ఉండగా మధ్యాహ్నం 2 గంటలకు 14.570 మీటర్లకు చేరింది. సాయంత్రం 5 గంటలకు 14.650 మీటర్ల మేర గోదావరి నీటిమట్టం ప్రవహిస్తోంది. 14.830 మీటర్లకు చేరితే పుష్కరఘాట్ వద్ద జలవనరుల శాఖ అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేయనున్నారు.

పుష్కరఘాట్ వద్ద గోదావరి నీటిమట్టం మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో ప్రవహిస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ముంపు ప్రాంతాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

ఆనందంలో అన్నదాత

రెండో విడత రుణమాఫీపై హర్షం

ములుగు జిల్లాలో 6,738 మందికి రూ.6.76 కోట్లు

ఇప్పటి వరకు మొత్తం 19,644 మందికి రూ.137.42 కోట్లు



ములుగు, జూలై 30: సాగు అవసరాలు, పెట్టుబడి కోసం బ్యాంకుల నుంచి తీసుకున్న రుణం మాఫీ అవుతుండటంతో అన్నదాతలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు విడతలుగా రుణ బకాయిలను రద్దు చేస్తుండగా ఇప్పటి వరకు రెండు విడతల్లో జిల్లాలోని 19,644 మంది రైతులు లబ్ధి పొందారు. మొత్తం రూ.137.42 కోట్లు మాఫీ అయ్యాయి. మంగళవారం రెండో విడతలో 6,738 మంది రైతులకు రూ6.76 కోట్లను రద్దు చేయగా, మొదటి విడతలో 12,906 మందికి రూ.6.97 కోట్ల మొత్తం రద్దయ్యింది. ఇప్పటి వరకు ఏటూరునాగారం మండలంలో 1,563 మంది రైతులకు రూ.11.69 కోట్లు, గోవిందరావుపేటలో 1,659 మందికి రూ.11.82 కోట్లు, కన్నాయిగూడెంలో 1400 మందికి రూ.9.18 కోట్లు, మంగపేటలో 2,744 మందికి 21.27కోట్లు, ములుగులో 4,240 మందికి రూ.28.25 కోట్లు, తాడ్వాయిలో 1,423 మందికి రూ.8.80 కోట్లు, వెంకటాపూర్(రామప్ప)లో 2,968 మందికి రూ.20.93 కోట్లు, వెంకటాపురం(నూగూరు)లో 1,917 మందికి రూ.12.32 కోట్లు, వాజేడు మండలంలో 1,730 మంది రైతులకు రూ.13.10 కోట్ల రుణం మాఫీ అయ్యింది.

అచ్చుతప్పులున్నా అనర్హులే..

ప్రభుత్వం జారీ చేసిన రుణమాఫీ నిబంధనలకు లోబడి అనేక మంది రైతులకు అర్హత ఉన్నప్పటికీ రెండు విడతల్లోనూ జారీ చేసిన జాబితాలో పేర్లు రాలేదు. ఆధార్, లోన్ అకౌంట్లలో రైతు పేరులో చిన్నచిన్న అచ్చుతప్పులున్నా 'మిస్‌మ్యాచ్' అంటూ రిమార్కు చూపించడంతో రుణమాఫీ కాలేదు. ఆహార భద్రత కార్డులో నమోదైన కుటుంబం ప్రాతిపదికన రూ.2లక్షల వరకు లోన్ మాఫీ చేస్తుండగా చాలామంది పేర్లు జాబితాలో కనిపించకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యవసాయాధికారులను సంప్రదించి ఫిర్యాదు చేస్తున్నారు. ఆధార్, బ్యాంకు అకౌంట్ వివరాలను అందజేస్తున్నారు.

భూపాలపల్లి జిల్లాలో 8,754 మందికి..

భూపాలపల్లి కలెక్టరేట్: రెండో విడత రైతు రుణమాఫీలో భాగంగా జిల్లాలోని 8,754 మందికి రూ. 95కోట్లు రుణమాఫీ అయినట్లు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. హైదారాబాద్ సచివాలయం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం నిర్వహించిన రూ.1.50లోపు రుణమాఫీ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి రైతులతో కలిసి కలెక్టర్ రాహుల్‌శర్మ తిలకించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో 16,502 మంది రైతులకు రూ. 85 కోట్లకుపై రుణాలు మాఫీ అయ్యాయన్నారు. రైతు రుణమాఫీ అయ్యి ఎటువంటి బకాయిలు లేని అర్హులైన ప్రతి రైతుకూ రుణాలు మంజూరు చేయాలన్నారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతులు ఏఈవోలను సంప్రదించాలని సూచించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఏవో విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అరెస్టు చేసిన వారిని కోర్టులో హాజరు పర్చాలి

మావోయిస్టు జేఎండబ్ల్యూపీ నేత వెంకటేశ్

ఏటూరునాగారం, జూలై 30 : పోలీసులు అదుపులోకి తీసుకున్న ముగ్గురిని వెంటనే కోర్టులో హాజరు పర్చాలని, వారికి ఎలాంటి హాని తలపెట్టినా ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని మావోయిస్టు జయశంకర్, మహబూబాబాద్, వరంగల్, పెద్దపల్లి (జేఎండబ్ల్యూపీ) డివిజన్ కమిటీ కార్యదర్శి కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ లేఖను విడుదల చేశారు. ఏటూరునాగారం-మహదేవపూర్ దళంలోని జైసింగ్, రమేష్ అనే ఇద్దరిని పోలీసులు ఈనెల 29న అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. వీరితోపాటు మరో మావోయిస్టు సుక్కిని మంగళవారం ఉదయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో అదుపులోకి తీసుకున్నారని, ఈ ముగ్గురిని ఎక్కడో దాచిపెట్టి చిత్రహింసలకు గురి చేస్తూ ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పోలీసుల అదుపులో ఉన్న ముగ్గురు మావోయిస్టులను 24 గంటల్లో ఎలాంటి ప్రాణహాని తలపెట్టకుండా కోర్టులో హాజరు పర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రభుత్వం, స్థానిక నాయకులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ అక్రమ అరెస్టును ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, బుద్ధి జీవులలు వ్యతిరేకించాలని వెంకటేశ్ పిలుపునిచ్చారు.

ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై ఫిర్యాదు



డైరెక్టర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న కాంగ్రెస్ నాయకుడు రాజేందర్

భూపాలపల్లిటౌన్, జూలై 30: భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్యులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. భూపాలపల్లి పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్ ఆధ్వర్యంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆస్పత్రికి వచ్చే పేదలకు సకాలంలో వైద్యం అందించడం లేదని, చికిత్సలు సక్రమంగా జరగడం లేదని ఆరోపించారు. పలువురు రోగులను ఇక్కడి వైద్యులు పరకాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి పంపిసున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

వృత్తి విద్యా కోర్సు విద్యార్థులకు సర్టిఫికెట్లు

భూపాలపల్లిటౌన్, జూలై 30: వృత్తి విద్యా కోర్సుల్లో (టీసీసీ) ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు వచ్చినట్లు డీఈవో రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరిలో నిర్వహించిన డ్రాయింగ్ (లోయర్, హయ్యర్), టైలరింగ్, ఎంబ్రాయిడరీ (లోయర్, హయ్యర్) పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని పరీక్షల విభాగంలో మెమోలను పొందొచ్చని పేర్కొన్నారు.

పాఠశాలల్లో వన మహోత్సవం

గోవిందరావుపేట, జూలై 30: మండలంలోని చల్వాయి మోడల్‌స్కూల్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా అటవీశాఖ అధికారులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మాధవి శీతల్, ఎంపీడీవో జవహర్‌రెడ్డి, మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ నిజామొద్దీన్, ఫారెస్ట్ అధికారులు శోభన్, వేణుగోపాల్, సుజాత, దీప్‌లాల్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

రమణక్కపేటలో..

మంగపేట: మండలంలోని రమణక్కపేట ఎంపీపీఎస్ పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్, గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో అటవీ శాఖ అధికారులు వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఫారెస్ట్ రేంజర్ మహ్మద్ షకీల్‌పాషా, ఎస్సై టీవీఆర్. సూరి, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గద్దెనెక్కి మోసం చేస్తున్న కాంగ్రెస్

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

ములుగు కలెక్టరేట్, జూలై 30: ఎన్నికలకు ముందు సాధ్యంకాని హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. ఓబీసీలను తీవ్రంగా అన్యాయం చేసిందని అన్నారు. ఈమేరకు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దండిగ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం కలెక్టరేట్‌ను ముట్టడించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా బలరాం మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగానే సీఎం రేవంత్‌రెడ్డి దాటవేత ధోరణి అవలంబిస్తున్నారని విమర్శించారు. ఓబీసీ రిజర్వేషన్ 42శాతం పెంచుతామని, మహాత్మా జ్యోతిరావుపూలే సబ్‌ప్లాన్ ఏర్పాటు చేస్తామని, రెండో విడత గొర్రెల పంపిణీ చేపడతామని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తామని, బీసీ సంక్షేమానికి రూ.20వేలకోట్ల ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తామని తదితర అంశాలను మేనిఫెస్టోలో పేర్కొన్నారని అన్నారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా ఎలాంటి హామీలను అమలుచేయక బీసీ ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా సీఎం హామీల స్ఫూర్తితో నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ దివాకరకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, నాయకులు భూక్య జవహర్‌లాల్, శీలమంతుల రవీంద్రచారి, కృష్ణాకర్, రాయంచు నాగరాజు పాల్గొన్నారు.

రంగంలోకి విజిలెన్స్?

ధాన్యం కొనుగోళ్ల అక్రమాలపై ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 30: ధాన్యం కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన కథనం చర్చనీయంగా మారింది. ధాన్యం కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై నిగ్గు తేల్చేందుకు రాష్ట్ర పౌరసరఫరాల కార్యాలయం దృష్టిసారించినట్లు సమాచారం. మరోవైపు జిల్లాలో 2021-22 సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లలో రూ. 4కోట్లకుపైగా అక్రమాలు జరిగినట్లు వచ్చిన కథనంపై కలెక్టర్ రాహుల్‌శర్మ ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి వివరణ కోరినట్లు తెలిసింది. ఎస్పీ కార్యాలయం సైతం ఈ అక్రమాలపై నిఘా వర్గాలను అలర్ట్ చేసినట్లు సమాచారం.

చిట్యాల, రేగొండ మండలాల్లో అంతకుమించి..

ఖరీఫ్ (2021-22) ధాన్యం కొనుగోళ్లలో తవ్వేకొద్దీ విస్తుపోయే నిజాలు బహిర్గతం అవుతున్నాయి. జిల్లాలోని చిట్యాల, రేగొండ మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో లెక్కకుమించిన అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సివిల్ సప్లయ్ ఉన్నతాధికారి అంతా తనై వ్యవహారం నడిపినట్లు సమాచారం. తను బినామీగా మిల్లులకు కొనుగోలు చేయని ధాన్యాన్ని కొన్నట్లు డబ్బులు చెల్లించి రూ. కోట్లు దండుకున్నాడనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. 2021-22 ఖరీఫ్‌తోపాటు రబీలో కూడా ఇదే స్థాయిలో అక్రమాలు జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై విజిలెన్స్ టీంలు దృష్టి సారించినట్లు సమాచారం.

గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలు

డోర్నకల్, (మహబూబాబాద్ జిల్లా), జూలై 30 : గంజాయి అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరికి మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించారు. డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని మరిపెడ మండలం తండ ధర్మారానికి చెందిన బానోత్ కిరణ్‌కుమార్ అలియాస్ దేవా, భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన బాదావత్ సూర్య అనే ఇద్దరు వ్యక్తులు ట్రాక్టర్ ద్వారా గంజాయి తరలిస్తున్నారు. డోర్నకల్‌లో 2021 జూలై 7న అప్పటి డోర్నకల్ ఎస్సై భద్రునాయక్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండా అనుమానస్పదంగా వస్తున్న ఆ ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేశారు. ట్రాక్టర్ ట్రాలీకింద ప్రత్యేకంగా తయారు చేయించిన అరలో 150 గంజాయి ప్యాకెట్లను పోలీసులు గుర్తించారు. ఒక్కో ప్యాకెట్ రెండు కిలోల బరువు ఉండగా 150 ప్యాకెట్లలో 3 క్వింటాళ్ల గంజాయి ఉంది. సుమారు దీని విలువ రూ.30 లక్షల వరకు ఉంటుందని అప్పటి ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి వెల్లడించారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితులైన కిరణ్‌కుమార్, సూర్యను అదుపులోకి తీసుకుని అప్పటి డోర్నకల్ సీఐ ఇస్లావత్ శ్రీనివాస్‌నాయక్ వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు కేసుకు సంబంధించిన వాదనలు వినిపించారు. ఈ కేసులో విచారణ అధికారిగా ఉన్న అప్పటి సీఐ ఇస్లావత్ శ్రీనివాస్ సాక్ష్యాన్ని ఆధారంగా తీసుకున్న మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ నిందితులైన బానోత్ కిరణ్‌కుమార్, బాదావత్ సూర్యకు 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

తరిగొప్పుల: జనగామ జిల్లా తరిగొప్పుల మండలం ఎన్యానాయక్‌తండా ఎక్స్‌రోడ్డు వద్ద గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను తరిగొప్పుల పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. కేసు వివరాలను జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. తరిగొప్పుల ఎస్సై అయ్యాల శ్వేత ఆధ్వర్యంలో పోలీసులు ఎన్యానాయక్ తండా ఎక్స్‌రోడ్డు వద్ద తనిఖీలు చేస్తున్న క్రమంలో అనుమానాస్పందంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద 1.565 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వీర్లగడ్డ తండాకు చెందిన భూక్య రమేష్ ఆలియాస్ రమ్మీ, జనగామ జిల్లా తరిగొప్పులకు చెందిన మహ్మద్ జలీల్‌ను విచారించగా భూక్య రమేష్ కరీంనగర్ నుంచి గంజాయి తీసుకువచ్చి జలీల్‌కు విక్రయిస్తుండగా జలీల్ తరిగొప్పుల చుట్టుప్రక్కల గ్రామాల యువకులకు ప్యాకెట్ల రూపంలో రూ. 100 నుంచి రూ.500లకు విక్రయిస్తున్నాడని తేలింది. ఈ విషయమై వరంగల్ సీపీ అంబర్ కిషోర్, జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఎస్సై శ్వేతను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ పార్థసారథి, నర్మెట సీఐ సాయిరమణ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జనగామ జిల్లా తరిగొప్పుల పోలీసుస్టేషన్‌లో నిందితులను చూపుతున్న డీసీపీ రాజమహేంద్ర నాయక్

ఎలక్ట్రిక్ లోకో పీవోహెచ్‌పై ఆశలు

● ఎంపీలు చొరవ చూపి కాజీపేటలో నిర్మిస్తే 10 వేలమందికి ఉపాధి ● సాధ్యాసాధ్యాలపై రైల్వే అధికారుల పరిశీలన



కాజీపేట, జూలై 30 : దక్షిణ భారత రైల్వేలను కలిపే కాజీపేట రైల్వే జంక్షన్‌లో ఎలక్ట్రిక్ పీవోహెచ్ షెడ్ నిర్మాణంపై ఉద్యోగుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. ప్రస్తుతం కాజీపేటలోఉన్న ఎలక్ట్రికల్ లోకోషెడ్ దక్షిణ మధ్య రైల్వేలోనే అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇక్కడ ఎలక్ట్రికల్ లోకో ఇంజన్‌ల నిర్వహణ, మరమ్మతులు చేసే ఒక మోటివ్ పవర్ డిపో.. దీనికి అనుసంధానంగా పీవోహెచ్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ ఎలక్ట్రికల్ పీరియాడికల్ ఓవరాలింగ్ (పీఓహెచ్) కాజీపేటలోనే నిర్మాణం జరుగుతోంది. కాజీపేటలో నిర్మాణం జరిగితే ఇక్కడి రూపురేఖలు మారుతాయని రైల్వే ఉద్యోగాల సంఘాలు అంటున్నాయి.. ఈ పీవోహెచ్ కాజీపేటకు తీసుకురాగలిగితే కాజీపేటను డివిజన్‌గా ఉన్నతీకరించడానికి పెద్దగా ప్రయాసపడాల్సిన పనిలేదని పలువురు అంటున్నారు. ఇప్పటికే కాజీపేటలో వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ వ్యాగన్ ఓవరాలింగ్ పరిశ్రమ నిర్మాణపనులు చకచకా జరుగుతున్నాయి. మరోవైపు రైల్వేస్టేషన్‌లో అమృత్‌భారత్‌లో నిర్మాణపనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడ ఎలక్ట్రికల్ పీవోహెచ్ నిర్మిస్తే కాజీపేట రైల్వే కార్మికులతో కళకళలాడుతూ పాత శోభను సంతరించుకుంటోంది. ఇక్కడ పీవోహెచ్ నిర్మిస్తే సుమారు 10 వేల మందికి జీవనోపాధి లభిస్తుంది. కాజీపేటకు ప్రాధాన్యం పెరుగుతుంది. సాధ్యాసాధ్యాలపై రైల్వే అధికారులు ఇక్కడికి వచ్చి ఈ మధ్యనే పరిశీలించారు. స్థలం, రైల్వే స్టాఫ్ పొజీషన్, నీటి సౌకర్యం తదితర అంశాలపై ఒక నివేదిక తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని అనుకూల అంశాలుగా ఉన్న కాజీపేటలోనే పీవోహెచ్ నిర్మించాలని రైల్వే కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఎలక్ట్రికల్ పీవోహెచ్ అంటే..

ఎలక్ట్రికల్ పీరియాడికల్ ఓవరాలింగ్ అంటే (పీవోహెచ్) ఎలక్ట్రిక్ లోకోలను ఒక్కొక్క భాగాలను విడదీసి ఓవరాలింగ్ చేసి కొత్త లోకో ఇంజన్ తయారు చేసే ప్రక్రియ. లోకోషెడ్‌లో మరమ్మతు చేసిన లోకో ఇంజన్‌లు ఇచ్చిన షెడ్యూల్ ట్రిప్పులు పూర్తయిన తర్వాత లోకోల మోడల్‌ను బట్టి 5,10,15 ఏళ్లకోసారి ఓవరాలింగ్ కోసం పీవోహెచ్ షెడ్‌కు రావల్సిందే. ఈ తతంగమంతా చేసే దానినే ఎలక్ట్రికల్ పీవోహెచ్ అంటారు. ఇలా పీవోహెచ్‌కు వచ్చిన లోకోల మెయింటనెన్స్, ఇన్‌స్పెక్షన్ చేయకముందే బయటకు పంపడం కుదరదు. ఒక విధంగా చెప్పాలంటే లోకోలను పరిశీలించి ఒక్కొక్కభాగాన్ని విడదీసి పనికొచ్చే భాగాలతో కొత్త లోకో తయారు చేయడమన్న మాట. అలాంటి ఎలక్ట్రికల్ పీవోహెచ్‌ను కాజీపేటలో నిర్మించడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. కాజీపేటలోనే నిర్మించడానికి అనుకూల అంశాలు ఎక్కువగా ఉన్నాయనే చర్చ ప్రారంభమైంది. ఇక్కడ ఎలక్ట్రికల్ లోకో షెడ్ ఉండటం, ఇక్కడే ప్రస్తుతం దాదాపు 200 లోకోలకు మరమ్మతులు చేయడం, కావాల్సినంత స్థలం, నీరు, రవాణా అనుకూలంగా ఉండటమే ప్రధాన అంశం. పైగా దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్‌కు మంచి రైల్, రోడ్ కనెక్టివిటీ ఉండడమే కూడా ప్రధానం అంశంగా చెప్పొచ్చు. కాచిగూడ, కాజీపేట డీజిల్ లోకోషెడ్, ఎలక్ట్రికల్ షెడ్, గుత్తి, గుంతకల్ విజయవాడలో ఉన్న లోకోషెడ్‌లలో మెత్తంగా 1,195 లోకోలు ఉన్నాయి. ఇక్కడ మరమ్మతులు అయిన లోకోలను పీవోహెచ్‌కు తరలించడానికి పంజాబ్‌లోని కపుర్తాలకు, చెన్నైలోని పెరంబదూర్ తరలించి ఓవరాలింగ్ చేయాల్సి వస్తుంది. రైల్వే బోర్డు ఆదేశాల ప్రకారం జోన్‌లో 800 లోకోలు ఉంటేనే పీవోహెచ్ నిర్మాంచాలని ఆదేశాలు ఉన్నాయి. మన జోన్‌లో 1,195 లోకోలు ఉన్నాయి. రైల్వే బోర్డు ఆదేశాలతో పీవోహెచ్ కాజీపేటలో కనుక నిర్మిస్తే లోకోలను తరలించే వ్యయాన్ని, సమయాన్ని ఆదా చేసుకోవడమే కాకుండా రైల్వేకు మంచి లాభం. అన్ని అర్హతలు ఉన్న కాజీపేటలోనే పీవోహెచ్ నిర్మించాలని రైల్వే కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ సమయంలో జిల్లా ఎంపీలు పట్టుపడితే కచ్చితంగా కాజీపేటకు వస్తుందని రైల్వేకార్మిక సంఘాలు, ఉద్యోగులు అంటున్నారు. ఎంపీలు చొరవచూపి ఇక్కడే నిర్మించేందుకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

సీనియర్ వైద్యుడు కుమారస్వామి మృతి

సూపరింటెండెంట్ విధుల్లో చేరాల్సిన ముందు రోజే ఘటన



డాక్టర్ బి.కుమారస్వామి

వరంగల్ మెడికల్, జూలై 30: భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రి పూర్వ సూపరింటెండెంట్, మంచిర్యాల ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ అయిన డాక్టర్ బోడ కుమారస్వామి సోమవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. హనుమకొండ పెద్దమ్మగడ్డ ప్రాంతానికి చెందిన అయన గతంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సర్జికల్ విభాగంలో సుదీర్ఘకాలం పాటు సేవలు అందించారు. ఆ తరువాత పదోన్నతిపై భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా వెళ్లారు. ప్రస్తుతం జరుగుతున్న సాధారణ బదిలీల్లో మంచిర్యాల ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. అయితే మంగళవారం మంచిర్యాలలో జాయిన్ కావాల్సి ఉండగా, సోమవారం రాత్రి అయన తన నివాసంలో ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో పెద్దమ్మగడ్డ శ్మశాన వాటికలో మంగళవారం కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించగా.. ఆయన మృతి పట్ల పలువురు ఐఎంఏ వైద్యులు, ప్రభుత్వ వైద్యులు సంతాపం ప్రకటించారు. ఇదిలా ఉంటే కొత్తగూడేనికి చెందిన కొందరి వేధింపుల వల్ల తన భర్త తీవ్ర ఆవేదనకు గురై మృతిచెందాడని ఆయన భార్య విలపించిన ఓ వీడియో వైరల్‌గా మారింది.

వరంగల్ వైద్యుడికి ప్రపంచస్థాయి గుర్తింపు



డాక్టర్ రమేశ్

వరంగల్ మెడికల్, జూలై 30: న్యూరో సైన్స్, అల్జీమర్స్ వ్యాధులపై పరిశోధనలు జరిపిన వరంగల్ వైద్యుడికి ప్రపంచస్థాయి గుర్తింపు లభించింది. అమెరికాకు చెందిన నాసా సైంటిస్ట్ అవార్డు ప్రదానం చేసింది. వరంగల్ జిల్లా నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో బయో కెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కందిమల్ల రమేశ్‌కు ఈ అరుదైన గౌరవం దక్కింది. డాక్టర్ రమేశ్ గతంలో కేఎంసీలో కూడా పనిచేశాడు. అనంతరం అమెరికాకు వెళ్లి పదేళ్ల అక్కడి మెమోరీ యూనివర్సిటీలో హెల్త్ సైన్సెస్ విభాగంలో అనేక పరిశోధనలు చేశారు. న్యూరో సైన్స్ విభాగంతోపాటు అల్జీమర్స్ వ్యాధిపై చేసిన పరిశోధనలకు గాను ప్రపంచస్థాయి గుర్తింపు లభించింది. ఈ వ్యాధులపై పరిశోధన చేసిన ప్రపంచస్థాయి శాస్త్రవేత్తల్లో ఇద్దరు ఉండగా, భారతదేశం నుంచి డాక్టర్ రమేశ్ ఆస్థానాన్ని దక్కించుకున్నారు. రెండు రోజుల కిందట అమెరికా నాసా సైంటిస్ట్ అవార్డును రమేశ్‌కు ప్రకటించింది.

ఐటీ రిటర్న్ దాఖలుకు నేడే ఆఖరు

వరంగల్ చౌరస్తా, జూలై 30: ఆదాయ పన్ను రిటర్న్‌కు బుధవారం ఆఖరి గడువని అధికారులు పేర్కొంటున్నారు. గడువులోపు ఐటీ రిటర్న్ దాఖలు చేయని వారు పన్ను చెల్లింపుదారులు తమ రిటర్న్‌లను రూ.5వేల పెనాల్టీతో డిసెంబరు 31 వరకు దాఖలు, రూ.వెయ్యి పెనాల్టీతో డిసెంబరు 31 వరకు చేసుకునే అవకాశాన్ని ఆదాయపు పన్ను శాఖ అవకాశమిచ్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతీ ఏటా ఆదాయ పన్ను శాఖకు వ్యాపార, వాణిజ్య, ఉత్పత్తి సంస్థలకు చెందిన వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు పన్ను చెల్లించే వారు 87వేల మంది ఉన్నారు. వీరు ప్రతీ ఏటా తమ ఆదాయాన్ని బట్టి తమ ఏడాది లాభ నష్టాలతో కూడిన వివరాల పత్రాలను ఆదాయపన్ను శాఖకు సమర్పిస్తారు.

ఉమ్మడి జిల్లాలో 1,500 మంది డిఫాల్టర్లు

వరంగల్ ఉమ్మడి జిల్లాలో దాదాపు 1,500 మంది డిఫాల్టర్లు ఉన్నారని సమాచారం. ఆదాయపన్ను శాఖ ప్రతీ ఏటా పన్ను చెల్లింపు ఐటీ రిటర్న్ దాఖలులో 1,500 మంది డిఫాల్టర్లు ఉన్నారని గుర్తించినట్లు సమాచారం. వీరికి నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలిసింది. ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం ఉద్యోగులకు, చిన్న తరహా వ్యాపారులకు రూ.3లక్షల నుంచి రూ.6లక్షల వరకు ఉన్న వారికి 5శాతం పన్ను, రూ.6లక్షల నుంచి రూ.9లక్షల వరకు 10శాతం, రూ.9లక్షల నుంచి రూ.12లక్షల వరకు 15 శాతం, రూ.12లక్షల నుంచి రూ.15లక్షల వరకు 20శాతం, రూ.15లక్షల ఆదాయం దాటిన ప్రతీ ఒక్కరు తమ ఆదాయంలో 30శాతాన్ని పన్నును ఆదాయ పన్ను శాఖకు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

తప్పులతో దాఖలు చేస్తే కఠిన చర్యలు : మహేందర్‌బాబు, ఉమ్మడి జిల్లా ఆదాయపన్ను శాఖ అధికారి

తప్పులతో దాఖలు చేస్తే కఠిన చర్యలు తప్పవు. కొందరు ఆదాయపు పన్ను చెల్లింపుదారులు దాఖలు పత్రాల్లో తప్పుడు సమాచారంతో మినహాయింపులు డిడెక్షన్లు చూపిస్తున్నారు. రావాల్సిన దానికన్నా ఎక్కువ రీఫండ్‌ను పొందుతున్న విషయం ఆదాయపన్ను శాఖ విభాగం దర్యాప్తులో తేలింది. తప్పుడు రిటర్న్ దాఖలు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి.

స్కూల్ బస్సును ఢీకొన్న లారీ

మడికొండ వద్ద ఘటన.. విద్యార్థులకు స్వల్పగాయాలు



లారీ ఢీకొని ధ్వంసమైన స్కూల్ బస్సు

మడికొండ, జూలై 30: స్కూల్ బస్సును లారీ ఢీకొనడంతో పలువురు విద్యార్థులకు గాయాలైన ఘటన మడికొండలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ జయరాజ్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక సక్సెస్ స్కూల్‌కు చెందిన బస్సు విద్యార్థులతో మడికొండ నుంచి ధర్మసాగర్ వైపు వెళుతోంది. అదే సమయంలో మంచిర్యాలకు చెందిన లారీ వరంగల్ నుంచి సిరిసిల్లకు వెళ్తున్న క్రమంలో వాల్మీకినగర్ వద్దకు రాగానే స్కూల్ బస్సును వెనుక నుంచి లారీ ఢీకొని, ఎదురుగావస్తున్న కారును సైతం ఢీకొట్టింది. దీంతో బస్సు వెనుక భాగం ధ్వంసమై అద్దం పగిలిపోయింది. దీంతో విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి, ఈ ఘటనలో కారు ధ్వంసమైంది. కొద్ది తేడాతో కారులోని వ్యక్తులు ప్రమాదం నుంచి తప్పించుకు న్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న స్థానికులు.. లారీలు గ్రామంలోకి రావొద్దని ఎన్నిసా ర్లు ఆందోళన చేసినా పట్టించుకునే నాథుడే లేడన్నారు. లారీల లారీలను గ్రామంలోకి రానివ్వద్దని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బురద మడిలో కుప్పకూలి రైతు మృతి

ఐనవోలు, జూలై 30: బురదమడిలో కుప్పకూలి రైతు మృతిచెందిన సంఘటన వెంకటాపురంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. డోబీల సంపత్(54) అనే రైతు మంగళవారం మధ్యాహ్నం గ్రామ శివారులో ఉన్న తన పొలం వద్దకు వెళ్లాడు. రెండు, మూడు రోజుల్లో పొలంలో నాటువేయాల్సి ఉండగా బురదమళ్లలో నీటిని పరిశీలిస్తూ గట్టుపై నుంచి నడుచుకుంటు వెళ్తూ బురదమడిలో బొర్లపడిపోయాడు. కొద్ది దూరంలో ఉన్న రైతులు అటుగా వచ్చి చూసేవరకు బురదమడిలో తల కూరుకుపోయి ఉన్నాడు. వారువచ్చి లేపే ప్రయత్నం చేయగా అప్పటికే మృతిచెందాడు. కుటుంబసభ్యులకు సమాచారం అందించగా మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. కాగా, సంపత్ గుండెపోటుతోనే మృతిచెందినట్లు కుటుంబసభ్యులు, గ్రామస్థులు భావిస్తున్నారు. మృతుడికి భార్య లక్ష్మి, ఒక కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్ద మృతిచెందడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది.

నర్సింగ్ ఆఫీసర్ల బదిలీ ఉత్తర్వులు విడుదల

వరంగల్ మెడికల్, జూలై 30: వైద్య, ఆరోగ్యశాఖ నాలుగో జోన్ పరిధిలోని నర్సింగ్ ఆఫీసర్స్ బదిలీ ఉత్తర్వులు మంగళవారం వెలువడ్డాయి. సీనియారిటీ జాబితాలో తప్పుల తడకలు, యూనియన్ ఆఫీస్ బేరర్స్ లేఖలు, ధర్నాలు, రాస్తారోకోలు, కౌన్సెలింగ్ సమయంలో జరిగాయి. హైదరాబాద్‌లో జరిగిన కౌన్సెలింగ్‌కు ఎంజీఎంకు చెందిన నర్సింగ్ ఆఫీసర్లు అందరూ వెళ్లడంతో నర్సింగ్ విద్యార్థులతో రోగులకు సేవలు అందించారు. వెంటనే విధుల్లో చేరాలని ఉత్తర్వులో పేర్కొనడంతో నాలుగో జోన్‌లోని నర్సింగ్ ఆఫీసర్లు అందరూ కొత్త పోస్టింగ్ బాట పట్టారు. కౌన్సెలింగ్‌లో కోరుకున్న చోటు కాకుండా మరో చోటు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారని మరికొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, 78మంది నర్సింగ్ ఆఫీసర్లను అధికారులు స్థానచలనం కల్పించారు.

వృత్తి నైపుణ్య శిక్షణకు 23 మంది ఎంపిక

కేయూ క్యాంపస్, జూలై 30: కాకతీయ యూనివర్సిటీలో 23 మందిని నెల రోజుల వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పించేందుకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేయూ ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ టీచింగ్ సెంటర్ నేతృత్వంలో నాలుగు వారాల పాటు 23 మందికి బిల్డింగ్ కెపాసిటీ, ఇంగ్లీష్ గ్రామర్, కంప్యూటర్ స్కిల్స్, ఆఫీస్ ప్రొసీడింగ్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తారు. వీరిలో క్లర్క్స్ కం టైపిస్టులు, జూనియర్ అసిస్టెంట్లు, స్టోర్ కీపర్స్, ల్యాబ్ అసిస్టెంట్స్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఉన్నారు. ప్రతీ రోజు సాయంత్రం 4 గంటల నుంచి 6గంటల వరకు తరగతులకు హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే ప్రిన్సిపాల్ ఖాతా నుంచి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున సెల్ఫ్ కార్యాలయానికి చెల్లించాలని వివరించారు. కేయూ పీఆర్‌వో, ఏఆర్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్‌ను సమన్వయకుడిగా నియమించారు.

బదిలీల్లో ఆఫీస్ బేరర్ల లేఖలు అసంబద్ధం

ఆర్జేడీకి ఫిర్యాదు చేసిన సీనియర్ అసిస్టెంట్

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 30: విద్యాశాఖలో ఇటీవల నిర్వహించిన బోధనేతర సిబ్బంది బదిలీల్లో ఆఫీస్ బేరర్ల లేఖలు అసంబద్ధంగా ఉన్నాయని ఖమ్మం డీఈవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న టి.గాయత్రిదేవి ఆరోపించారు. ఆఫీస్ బేరర్ల అసంబద్ధ లేఖలతో తనకు అన్యాయం జరిగిందంటూ ఆమె మంగళవారం హనుమకొండలోని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం బదిలీల ఉత్తర్వులు వెలువరిచిన తర్వాత యూనియన్ ఆఫీస్ బేరర్‌గా జారీ చేసిన లేఖలు లెక్కా పత్రం లేకుండా ఉన్నాయని విమర్శించారు. లేఖలను అభ్యర్థుల పేరున వ్యక్తిగతంగా ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమన్నారు. బదిలీల నిబంధనల మేరకు 40 శాతంలో తాను రానప్పటికీ అక్రమ మార్గంలో నలుగురు సహోద్యోగులు టీఎన్‌జీవోస్ ఆఫీస్ బేరర్లుగా లేఖలు సమర్పించడంతో తాను హనుమకొండ నుంచి ఖమ్మం జిల్లాకు బదిలీ అయ్యానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు యూనియన్ ఆఫీస్ బేరర్లు అయినప్పటికీ స్టేషన్ సీనియారిటీలో ఆరేళ్లంటే వారిని తప్పకుండా బదిలీ చేయాల్సిందేనని ఉన్నప్పటికీ అధికారులు ఆ నిబంధనను విస్మరించారని ఆరోపించారు. ఇలాంటి పొరపాట్లే రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలో జరిగితే ఆఫీస్ బేరర్ల లేఖలు సమర్పించిన వారిని నిబంధనల మేరకు బదిలీలు చేశారన్నారు. ఉద్యోగుల బదిలీల నిబంధనలు డిపార్ట్‌మెంట్‌కు ఒక విధంగా ఉంటాయా? అని ఆమె ప్రశ్నించారు. అసంబద్ధంగా, అక్రమ మార్గంలో ఆఫీస్ బేరర్ల లేఖలను తీసుకురావడంతోనే బదిలీల్లో తనకు అన్యాయం జరిగిందంటూ ఆమె ఆరోపించారు. వైద్యశాఖలో అధికారులు చేపట్టిన చర్యల్లాగా విద్యాశాఖలోనే అలాంటి చర్యలు చేపట్టి తనకు న్యాయం చేయాలని ఆమె అధికారులను వేడుకుంది. తాను ఈ విషయంపై రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శితో పాటు డైరెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నానన్నారు.

అయ్యో.. రామా!

- అయోధ్య సరయూ నదిలో జనగామ యువతి గల్లంతు
- బాలరాముడి దర్శనానికి వెళ్లిన క్రమంలో ఘటన
- నదీస్నానం చేస్తూ కొట్టుకుపోయిన ఐదుగురు
- నలుగురిని కాపాడిన రెస్క్యూ టీమ్



అయోధ్యకు వెళ్లే ముందు హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ఫొటో దిగిన నాగరాజు కుటుంబసభ్యులు, గల్లంతైన తేజశ్రీ (ఇన్‌సెట్లో)

జనగామ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అయోధ్య బాలరాముడి దర్శనానికని సంతోషంగా వెళ్లిన ఆ కుటుంబానికి దేవుడు తీరని శోకాన్ని మిగిల్చాడు. నీటి ప్రవాహం రూపంలో వచ్చిన మృత్యువు కళ్ల ముందే కూతురును బలితీసుకుంది. కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా నదీస్నానం చేస్తున్న యువతిని సరయూ నది మింగేసింది. ఈ హృదయ విదారక సంఘటన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్య లక్ష్మణ కిలా ఘాట్ వద్ద జరిగింది. లక్ష్మణ ఘాట్‌లో స్నానం చేస్తున్న జనగామకు చెందిన యువతి సరయూ నదిలో గల్లంతైంది. జనగామకు చెందిన తాళ్లపల్లి నాగరాజు ఉపాధి కోసం జనగామలోని సిద్దిపేట రోడ్డులో వాటర్ ప్లాంట్ నడుపుతున్నాడు. కుటుంబ సభ్యులందరితో అయోధ్య, కాశీ యాత్ర చేయాలని నిర్ణయించుకున్నారు. తన భార్య జయసుధ, కూతుళ్లు తేజశ్రీ, తరుణితో పాటు సోదరులు చంద్రశేఖర్, చందు కుటుంబ సభ్యులతో కలిసి అయోధ్య, కాశీ యాత్రకు వెళ్లారు. ఆదివారం రాత్రి విమానంలో హైదరాబాద్ నుంచి అయోధ్యకు చేరుకున్నారు. సోమవారం ఉదయం అయోధ్య బాలరాముడి దివ్య దర్శనం పూర్తి చేసుకున్నారు. తర్వాత కాశీకి వెళ్లేముందు అయోధ్యలోని సరయూ నది ఒడ్డున ఉన్న లక్ష్మణ ఘాట్‌లో నదీస్నానం చేస్తుండగా ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగిపోయింది. దీంతో ఘాట్‌లో స్నానం చేస్తున్న ఐదుగురు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయారు. ఆ సమయంలో అక్కడే ఉన్న రెస్క్యూ టీమ్ స్పందించి నలుగురిని కాపాడింది. నీటిప్రవాహం మరింతగా పెరగడంతో నాగరాజు పెద్దకూతురు తేజశ్రీ(17) నీటిలో కొట్టుకుపోయింది. సోమవారం ఉదయం ఈ ఘటన జరగగా మంగళవారం రాత్రి వరకు యువతి ఆచూకీ లభ్యం కాలేదు. సరయూ నదిపై ఉన్న డ్యామ్ గేట్లు ఎత్తడం వల్ల నీటి ప్రవాహం పెరిగి ఉంటుందని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. కాగా.. తేజశ్రీ జనగామలోని ఏబీవీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది.

కన్నీరుమున్నీరుగా..

కళ్లముందే కూతురు గల్లంతు కావడంతో ఆ తల్లితండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఊరు కాని ఊరులో తమ బిడ్డ ఆచూకీ లభ్యం కావాలని, ప్రాణాలతో బయట పడాలని ఆ అయోధ్య రాముడిని తలచుకుంటూ ఆ కుటుంబ సభ్యులు సరయూ నది ఒడ్డునే బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అప్పటిదాకా అందరితో సంతోషంగా, నవ్వుతూ గడిపిన కూతురు గల్లంతు కావడం ఆ తల్లితండ్రులకు, కుటుంబ సభ్యులకు తీరని దుఃఖాన్ని మిగిల్చింది.

యూపీ అధికారులకు బండి సంజయ్ లేఖ

యువతి గల్లంతు విషయాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లారు. వారు బాధిత కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడారు. యూపీ అధికారులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ లేఖ రాశారు. యువతి ఆచూకీని త్వరగా కనుక్కోవాలంటూ అయోధ్య కలెక్టర్ చంద్ర విజయ్‌సింగ్, అయోధ్య ఎస్పీ రాజ్ కరణ్ నాయర్, యూపీ ముఖ్యమంత్రి ఓఎస్డీకి సూచించారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న రావుల వెంకట్‌రెడ్డి

వికలాంగులకు ఉచితంగా మూడెకరాల భూమి ఇవ్వాలి

వడ్డెపల్లి, జూలై 30: వికలాంగులందరికీ జీవోనంబర్ 56 ప్రకారం ఉచితంగా మూడెకరాల భూమి ఇవ్వాలని దివ్యాంగుల సేవా సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రావుల వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు దివ్యాంగుల సేవా సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బండిస్వరూప, రాష్ట్ర సలహాదారుడు సమ్మెట వేణుగోపాల్ మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిన విధంగానే దివ్యాంగులకు సైతం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని అన్నారు. బ్యాంకులతో నిమిత్తం లేకుండా రూ.10లక్షల రుణాలను ఇవ్వాలని కోరారు. సమావేశంలో దివ్యాంగుల సేవా సంఘం జిల్లా నాయకులు రాజయ్య, మహాలక్ష్మి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

బస్సు నడిపేటప్పుడు డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా

బాలసముద్రం, జూలై 30: బస్సు నడిపేటప్పుడు డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా సూచించారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్వహిస్తున్న ప్రమాద రహిత వారోత్సవాలను వరంగల్ 1డిపోలో ముగింపు వేడుకలను వరంగల్ ఆర్టీసీ రిజినల్ మేనేజర్ డి.విజయభాను ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా పాల్గొని ఆర్టీసీ రీజినల్ పరిధిలో 9 డిపోల నుండి ఆర్టీసీ విధులలో ప్రతిభ కనబరిచిన డ్రైవర్లను ఇతర సిబ్బందిని శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. బస్సు నడుపుతున్నప్పుడు జాగ్రత్తగా నడపాలని సూచించారు. ఆర్ఎం డి.విజయభాను మాట్లాడుతూ.. అత్యధిక సర్వీస్ కలిగి ప్రమాదరహిత డ్రైవర్లుగా అవార్డులు అందుకున్న డ్రైవర్లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు కె.భానుకిరణ్, మాధవరావు, రీజియన్‌లోని 9 డిపోల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

'ఆశ్రమ' అవస్థలు

సమస్యలతో సతమతమవుతున్న విద్యార్థులు

మేడారం, జూలై 30: తాడ్వాయి మండలం బయ్యక్కపేట గ్రామంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ప్రాథమికోన్నత పాఠశాలలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం నీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు లేక అవస్థ పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ఇక్కడ బోరు మోటారు పని చేయడం లేదు. మరుగుదొడ్లు ధ్వంసమైనా పట్టించుకొనే వారే కరువయ్యారని విద్యార్థినీ విద్యార్థులు అంటున్నారు. మరుగుదొడ్లు లేక వాగు వైపు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు, స్నానాలు పాఠశాలలోని చేతిపంపు కింద చేస్తున్నమని అన్నారు. అలాగే ఇక్కడ భోజనశాల కూడా లేదు. దీంతో విద్యార్థులు చెట్లకిందనే భోజనం చేస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులకు పలుసార్లు ఉపాధ్యాయులు తెలిపినప్పటికీ పట్టించుకోవడం లేదని వర్కర్లు తెలిపారు.


భోజనశాల లేక ఆరుబయట బారులు తీరిన విద్యార్థులు


నిరుపయోగంగా బోరు

పాఠశాలలో మూడు నుంచి ఏడో తరగతి వరకు చదువుకునే 110 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. వీరిలో 40 మంది మాత్రమే ఉన్నారు. మిగతా విద్యార్థులు ఎక్కడ? అని ప్రశ్నించగా రెండు రోజుల సెలవుకు ఇంటికి వెళ్లారని సిబ్బంది తెలిపారు. సమయానికి భోజనం ఏర్పాట్లు చూసుకుం టున్నామని వారు అన్నారు. అయితే.. వార్డెన్ మాత్రం అందు బాటులో ఉండటం లేదని తెలిసింది. పాఠశాలలలోని ఈ సమస్యలపై ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్‌కు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు.

కలెక్టరేట్ ఎదుట ఓబీసీ మోర్చా ధర్నా


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఓబీసీ శ్రేణులు

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 30: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీసీ డిక్లరేషన్ అమలుచేస్తామని చెప్పి మోసం చేసిందని ఆరోపిస్తూ బీజేపీ అనుబంధ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ మాట్లాడుతూ బీసీ కులగణన చేపట్టకుండానే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం అవుతుండటం సరికాదన్నారు. బీసీలకు వెంటనే 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ సబ్‌ప్లాన్‌కు నిధులు మంజూరుచేయాలన్నారు. గొల్లకురుమలకు రెండోదశ గొర్రెల పంపిణీ చేయాలన్నారు. మత్స్యకారులకు సబ్సిడీతో చాప పిల్లలను పంపణీ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో నాంపల్లి కుమార్, రాజుగౌడ్, కంబాల రాజయ్య, భట్టు రవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానితుల సమాచారం ఇవ్వండి

భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు


గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ సంపత్‌రావు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూలై 30: అనుమానిత వ్యక్తులెవరైనా తారస పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని భూపాలపల్లి డీఎస్పీ అవిర్నేని సంపత్‌రావు అన్నారు. మావోయిస్టు సంస్మరణ వారోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో భూపాలపల్లి మండలంలోని పందిపంపుల గ్రామంలో ఆ గ్రామస్థులతో ఆయన సమావేశమయ్యారు. అటవీ గ్రామాలపై పోలీసుల ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. చట్ట వ్యతిరేక పని చేసే వ్యక్తులకు ఎవరూ సహకరించొద్దని, కొత్త వ్యక్తులు గానీ, అనుమాని వ్యక్తులు గానీ కనిపిస్తే వెంటనే తమకు తెలియజేయాలని సూచించారు. అలాంటి వారికెవరైనా సహకరించినట్లు తెలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సై సుధాకర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పోగొట్టుకున్న 38 సెల్‌ఫోన్ల రికవరీ

భూపాలపల్లి సబ్ డివిజన్ పరిధిలో వివిధ కారణాలతో ప్రజలు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలోని డీఎస్పీ చాంబర్‌లో 38 మంది బాధితులకు వారి సెల్‌ఫోన్లను అప్పగించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాలతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. ఇంకా బాధితులెవరైనా వివిధ కారణాలతో ఫోన్లు పోగొట్టుకుంటే సంబంధిత ఠాణాల్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్, చిట్యాల సీఐ మల్లేష్‌యాదవ్, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సైలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

చిట్యాల, జూలై 30: మండలంలోని జడల్‌పేటలోని ఓ ఇంటి వద్ద పేకాట ఆడుతున్న ఐదుగురిని మంగళవారం సాయంత్రం పట్టుకున్నట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 4,600 స్వాధీన పర్చుకున్నట్లు చెప్పారు. ఈదాడిలో కానిస్టేబుళ్లు నవీన్, నాగరాజు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

2న దివ్యాంగుల శిబిరం

భూపాలపల్లిటౌన్, జూలై 30: జిల్లాలోని దివ్యాం గులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని ఆగస్టు 2న నిర్వహిస్తున్నట్టు డీఈవో రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూపాలపల్లి పట్టణంలోని భవిత సెంటర్‌లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరాన్ని జిల్లాలోని వివిధ మండలాల నుంచి 18 ఏళ్ల లోపు దివ్యాంగులు వినియోగించుకోవాలని కోరారు.

పేరూరు వద్ద పెరుగుతున్న గోదావరి

వాజేడు, జూలై 30: మండలంలోని పేరూరు వద్ద గోదావరి నెమ్మదిగా పెరుగుతోంది. ఆదివారం 15.64 మీటర్ల నీటి మట్టంతో నిలకడగా ఉన్న గోదావరి వరద మళ్లీ పెరిగింది. సోమవారం సాయంత్రం నుంచి పెరుగుదల ప్రారంభమైంది. మంగళవారం ఉదయం 10గంటలకు 15.86 మీటర్లు, 12 గంటలకు 15.92 మీటర్లు, 2గంటలకు 15.96 మీటర్లు, 3గంటలకు 15.98 మీటర్లు, 4గంటలకు 15.99 మీటర్ల చేరుకొని క్రమంగా పెరుగుతోందని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు.

మళ్లీ రాకపోకలకు అంతరాయం

ఇది ఇలా ఉండగా ఆదివారం 163 జాతీయ రహదారి టేకులగుడెం వద్ద వరద నీటి ప్రవాహం తగ్గడంతో సోమవారం రాకపోకలు ప్రారంభమయ్యాయి.

సోమవారం రాత్రి గోదావరి వరద ప్రవాహం పెరగటంతో మళ్లీ టేకులగుడెం వద్ద ఉన్న రేగుమాగు గండికి వరద ప్రవాహం పెరిగి జాతీయ రహదారిపై వరద నీరు చేరాయి. దీంతో మంగళవారం రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రుణమాఫీ ఫలాలు అందేలా చర్యలు

ములుగు కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జూలై 30: జిల్లాలోని ప్రతి రైతుకు రుణమాఫీ ఫలాలు అందేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర అసెంబ్లీ నుంచి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇతర మంత్రులు, రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి రుణమాఫీ రెండో విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు విడతలలో కలిపి జిల్లాలో మొత్తం 19,644మంది రైతులకు రూ.137కోట్ల రుణమాఫీ సొమ్మును ప్రభుత్వం విడుదల చేసిందని అన్నారు. మొదటి విడత కింద రూ.లక్ష వరకు రుణమాఫీ జరిగిన 12,906 మంది రైతుల్లో దాదాపు 99శాతం మేర రుణాలు ఖాతాల్లో జమచేయడం జరిగిందని, ఇప్పటివరకు రూ.11కోట్లను రెన్యువల్ చేసి రైతుల ఖాతాల్లో నిధులు జమచేసి రుణమాఫీ ఫలాలు రైతులకు అందించామని తెలిపారు. రెండో విడత రూ.లక్షన్నర రుణమాఫీ కింద జిల్లాలో 6738మంది రైతులకు రూ.67కోట్లకుపైగా నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని, వీటిని సైతం వచ్చేవారంరోజుల్లో రైతులకు పూర్తిస్థాయిలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామని అన్నారు. రైతుల రుణాలు రెన్యువల్ చేసి రుణమాఫీ ఫలాలు రైతులకు అందేలా బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. 12 డిసెంబరు 2018 నుంచి 9 డిసెంబరు 2023వరకు రైతులు నూతనంగా తీసుకున్న రుణాలు, రెన్యువల్ చేసుకున్న రుణాలు అసలు, వడ్డీ కలిపి రూ.2లక్షల వరకు ప్రతి రైతు కుటుంబానికి మాఫీ జరుగుతుందని, రైతు కుటుంబానికి రూ.2లక్షలకంటే అధికంగా రుణం ఉన్నట్లయితే కుటుంబంలోని మహిళ పేరుపై రుణాలు నిబంధనల మేరకు ముందుగా మాఫీ అవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రూ.2లక్షల రైతు రుణమాఫీ పథకం అమలవుతుందని తెలిపారు. జిల్లాలోని 9మండలాల్లో రైతుల సౌకర్యార్థం రుణమాఫీపై ఫిర్యాదుల పరిష్కారానికి గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు గ్రీవెన్స్‌సెల్‌ను సంప్రదించి సమస్యలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌చంద్ర, లీడ్ బ్యాంకు మేనేజర్ రాజ్‌కుమార్, డీసీవో సర్దార్‌సింగ్, వ్యవసాయశాఖ అధికారులు, పీఏసీఎస్ సొసైటీ చైర్మన్లు, సీఈవోలు, బ్యాంకు బ్రాంచ్ మేనేజర్లు, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తాడిచర్ల ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి పునఃప్రారంభం

మల్హర్, జూలై 30 : సుమారు రెండు వారాల తర్వాత తాడిచర్ల ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి పునః ప్రారంభమైంది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వల్ల అంతరాయం ఏర్పడిన విషయం విదితమే. మంగళవారం ఉదయం నుంచి ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైనట్లు మైన్ అధికారులు తెలిపారు. వర్షం వల్ల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోవడంతో సుమారు రూ 8 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. ఈ ఓసీపీలో రోజుకు 1.30 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి, 6 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేపడుతుంటారు.

పంటల్లో కలుపు నివారణపై అవగాహన

కాటారం, జూలై 30: మండల కేంద్రంలోని కాటారం రైతువేదికలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ రకాల పంటల్లో కలుపు నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు రైతునేస్తం కార్యక్రమాన్ని వీక్షించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వరి, పత్తి, మొక్కజొన్న, పెసర, మినుము తదితర పంటల్లో కలుపు నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలను వివరించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, వ్యవసాయాధికారులు రెండో విడత రుణ మాఫీ నిధుల విడుదల కార్యక్రమం రైతులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సరిత, శరత్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఏవోగా ఖాజా మొయినుద్దీన్


బాధ్యతలు స్వీకరిస్తున్న ఖాజా మొయినొద్దీన్

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 30: భూపాలపల్లి కలెక్టరేట్ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ (ఏవో)గా ఖాజా మొయినుద్దీన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఏవోగా పనిచేసిన మహేష్‌బాబు ములుగు జిల్లాకు బదిలీ అయ్యారు. చిట్యాల తహసీల్దార్‌గా పనిచేస్తున్న మొయినుద్దీన్‌ను ఆయన స్థానంలో కలెక్టరేట్‌కు బదిలీచేసి ఏవోగా నియమించారు.

వరదలకు కొట్టుకొచ్చిన మొసలి కళేబరం


మొసలి కళేబరం

వాజేడు, జూలై 30: ఇటీవల వచ్చిన వరదలకు మొసలి కళేబరం కొట్టుకొచ్చింది. మండలంలోని పాయబాట్ల సమీపంలో ఉన్న కొంగాల వాగులో స్థానికులు గుర్తించారు. ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఎఫ్ఎస్‌వో చిన్నక్క, ఎఫ్‌బీవోలు లలిత, మోహన్, హతీరామ్, పున్నమయ్య, జీపీ సెక్రటరీ శిరిష అక్కడికి చేరుకొని మొసలి కళేబరాన్ని బయటకు తీసి ఖననం చేశారు. సుమారు ఐదు అడుగులు ఉన్న మొసలి నాలుగు రోజుల క్రితమే మృతి చెంది ఉంటుందని ఫారెస్టు అధికారులు తెలిపారు. తదితరులు ఉన్నారు.

ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బదిలీ

నూతన ఏపీవోగా భీంరావు

ఏటూరునాగారం రూరల్, జూలై 30: ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఏపీవో) వసంతరావు బదిలీ అయ్యారు. ఉట్నూర్ ఐటీడీఏ ఏపీవోగా ప్రభుత్వం ఆయన్ను నియమించింది. ఉట్నూర్ ఐటీడీఏ ఏపీవోగా విధులు నిర్వర్తిస్తున్న భీంరావును ఏటూరునాగారానికి బదిలీ చేసింది.

బొర్రవాగు బ్రిడ్జి నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు


బొర్రవాగుపై ఉన్న లో లెవల్ కాజ్‌వే

కాటారం, జూలై 30: మండలంలోని కాటారం-మేడారం ప్రధాన రహదారిలో పోతుల వాయి సమీపంలోని బొర్రవాగుపై హెచ్ఎల్‌బీ(హై లెవల్ బ్రిడ్జి) నిర్మాణానికి రూ.2కోట్ల నిధులు మంజూరయ్యాయి. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరవతో లోలెవల్ కాజ్‌వే స్థానంలో దీనిని నిర్మిస్తున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయిందని వానాకాలం ముగిసిన వెంటనే పనులు ప్రారంభమవుతాయని ఆర్అండ్‌బీ ఏఈ అవినాష్ తెలిపారు. వానాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడల్లా వాగు ఉప్పొంగి రాకపోకలు నిలిచిపోతున్న నేపథ్యంలో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు కావడం సంతోషకరమని ఇబ్రహీంపల్లి తాజా మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్ దబ్బెట సరోజనరాజేషం, రాజశేఖర్, పలు గ్రామాల ప్రజలు, వాహనదారులు అన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్


కేటీకే గని వద్ద ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, పిట్ సెక్రటరీ శ్రీను తదితరులు

కాకతీయఖని, జూలై 30: సింగరేణి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-6వ గనిని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనిస్థలాల్లో కార్మికులను పలు సమస్యలు వేధిస్తున్నాయని, ప్రధానంగా అండర్ గ్రౌండ్ లోపల వెంటిలేషన్ సమస్య ఉందని గని మేనేజర్ రామ్‌భరోసా మెహతో దృష్టికి తీసుకెళ్లారు. కార్మికుల ససమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయాలని కోరారు. దీంతో గని మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు రాజ్‌కుమార్ తెలిపారు. కేటీకే-6వ గని ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, చంద్రమౌళి, సత్యనారాయణ, కృష్ణమూర్తి, రాజన్న, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శాఖ ఉద్యోగుల నిరసన

ములుగు కలెక్టరేట్, జూలై 30: ములుగులో నూతనంగా ఏర్పాటైన మెడికల్ కళాశాలలో ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరుతూ వైద్య ఉద్యోగులు మంగళవారం ములుగులోని ఏరియా వైద్యశాల ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ములుగు ఏరియా వైద్యశాలలో పనిచేస్తున్న వైద్య ఉద్యోగులకు ప్రాధాన్యత ఇచ్చి మెడికల్ కళాశాలలో అవకాశం కల్పించాలని గతంలో మంత్రి సీతక్కను కోరినట్లు తెలిపారు. తమకంటే అనర్హుల పేర్లు మెరిట్ లిస్టులో పెట్టారని ఆరోపించారు. ఇప్పటికైనా మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ చొరవతీసుకుని మెడికల్ కళాశాలలో తమకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య ఉద్యోగులు ఎమ్డీ.ఫజల్, గాదె రమేష్, వినోద్‌కుమార్, సదయ్య, స్వామి, రమేష్, లత, ప్రమీల, జయసుధ, కృష్ణ, విజయ్‌చందర్, అనిల్, రవి, అజిత, శ్రీను, బాలు, వేణునాయక్, సురేష్‌తోపాటు ఔట్‌సోర్సింగ్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గొల్ల కురుమలను ఆదుకోవాలి

ములుగు కలెక్టరేట్, జూలై 30: గొర్రెల పంపిణీ పథకంలో డీడీలు చెల్లించిన తమను ఆదుకోవాలని వెంకటాపురం(నూగూరు) మండలం ఉప్పేడు, గొల్లగూడెం గ్రామాల్లోని గొల్లకురుమలు జిల్లా కలెక్టర్ దివాకరను కోరారు. ఈసందర్భంగా వారు మంగళవారం ములుగులోని కలెక్టర్ కార్యాలయం ఎదుట మాట్లాడారు. 14నెలల క్రితం 60గొల్లకురుమ కుటుంబాలు గొర్రెల పంపిణీ పథకం కోసం డీడీలు చెల్లించడం జరిగిందని అన్నారు. అయితే గొర్రెల పంపిణీ పథకాన్ని నిలిపివేయడంతో డబ్బులు తిరిగి రాక అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఈవిషయంలో కలెక్టర్ స్పందించి తాము చెల్లించిన డీడీ డబ్బులను తిరిగి ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఏషబోయిన సాంబయ్య యాదవ్, యాదండ్ల రాజు, ఆయా గ్రామాల్లోని గొల్లకురుమలు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

వెంకటాపురం(నూగూరు), జూలై 30: మండలంలోని సుడిబాక, ఉప్పేడు, వీరాపురం, చిరుతపల్లి గ్రామాల్లో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం వేర్వేరుగా వైద్యశిబిరాలు జరిగాయి. ఈసందర్భంగా ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ గ్రామస్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా పలువురి నుంచి రక్తనమూనాలు సేకరించారు. సీజనల్ వ్యాధులు దరిచేరకుండా ప్రజలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మండలకేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రంలో మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈశిబిరాల్లో వైద్యులు సోహల్, వినయ్, ఆశీష్, స్నేహ, సిబ్బంది జ్యోతి, యాకలక్ష్మి, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

సమానత్వ భావనకు తిథి భోజనం

చిట్యాల, జూలై 30: విద్యార్థులలో సమానత్వ భావనను పెంపొందించేందుకు తిథి భోజనం కార్యక్రమం దోహదపడుతుందని మండల విద్యాశాఖ అధికారి కోడెపాక రఘుపతి అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి అదనంగా పండ్లు, స్వీట్లు పదార్థాలతో మంగళవారం తిథి భోజనం వడ్డించారు. చిట్యాల ఉన్నత పాఠశాలలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజ భాగస్వామ్యం, విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే తిథి భోజనం కార్యక్రమం ముఖ్యోద్దేశమన్నారు. స్థానిక వ్యాపారులు, యువత, గ్రామస్థులు, ఉపాధ్యాయులు సొంత ఖర్చులతో విద్యార్థులకు పండ్లు, స్వీట్లు అందించారు. ఈకార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కృష్ణ, ఊర్మిళ, వాసంతి, రూస్సీ తదితరులు పాల్గొన్నారు.

రాఘవరెడ్డిపేట పాఠశాలలో..

టేకుమట్ల: మండలంలోని రాఘవరెడ్డిపేట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు పద్మ ఆధ్వర్యంలో తిథి భోజనం కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం భోజనంతో పాటు పౌష్టికాహారం కోసం పిల్లలకు ఫ్రై రైస్, అరటిపండ్లను అందించారు. ఆరెపల్లి గ్రామానికి చెందిన గువ్వాడి లక్ష్మణ్ ఆర్థిక సాయం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణు, వరప్రసాద్, సుధాకర్, మొండయ్య, సతీష్, సదయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిమానవుల సమాధులను సందర్శించిన గాయకులు


సమాధులను పరిశీలిస్తున్న గాయకులు

తాడ్వాయి, జూలై 30: మండలంలోని దామెరవాయి గ్రామ సమీపంలో గల ఆదిమానవుల సమాధులను సింగర్స్ ప్రశాంత్‌కుమార్, బాలు కె.అసురమంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా వారు సమాధులను పరిశీలించి ప్రకృతి అందాలను తిలకించారు. అ ఆదిమానవుల సమాధుల ప్రాంతంలో ఒక పాటను చిత్రీకరించనున్నట్లు తెలిపారు. వారి వెంట స్థానిక యువకులు కార్తీక్, మోరె ప్రశాంత్, శ్రీహరి, కొత్తూరి రోహిత్, సిద్ధు, తదితరులు ఉన్నారు.

భారీ వర్షాలకు కూలిన గోడ

కాటారం, జూలై 30: మండలంలోని దేవరాంపల్లిలో తాటి సారక్క అనే మహిళకు చెందిన ఇంటి గోడ సోమవారం రాత్రి కూలింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో గోడ నాని కుప్ప కూలినట్లు సారక్క తెలిపారు. గదిలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధితురాలు కోరుతున్నారు.

సీతక్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

మంగపేట, జూలై 30: సీతక్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని రమణక్కపేట గ్రామపంచాయతీ ఆవరణలో మంగళవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వివిధ వ్యాధులు, జ్వరాలతో గ్రామస్థులు బాధపడుతున్నారని మంత్రి సీతక్క, ఆమె కుమారుడు సూర్య దృష్టికి తీసుకెళ్లగా మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారని మంగపేట సహకార సంఘం డైరెక్టర్ కొడం బాలకృష్ణ తెలిపారు. వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, యమున, అన్వేష్ ఈ శిబిరంలో 500 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఎస్సై టీవీఆర్ సూరి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వల్లెపల్లి శివప్రసాద్, యువజన కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జి ఎం.డి. ఇస్సార్‌ఖాన్, కాంగ్రెస్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డీనేటర్ కర్రి నాగేంద్రబాబు, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొంకతి సాంబశివరావు, మంగపేట సింగిల్‌విండో డైరెక్టర్ గంటా సునీత రామారావు, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్, భానుచందర్, ముకుందం, ఆదినారాయణ, బాబురావు, ఎడ్ల నరేష్, ఎం.ప్రవీణ్, ఎం.చంటి, కె. ప్రేమ్‌కుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సీతక్కకు కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి : కాంగ్రెస్

ఏటూరునాగారం, జూలై 30 : మంత్రి సీతక్కకు హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి సీతక్కపై అసెంబ్లీలో కౌశిక్‌రెడ్డి అనుచితంగా మాట్లాడటం అహంకార ధోరణికి నిదర్శనమని విమర్శించారు. ఓటు వేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి ఎమ్మెల్యేగా గెలిచిన చరిత్ర కౌశిక్‌దని వ్యాఖ్యానించారు. సమావేశంలో కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ. అయ్యుబ్ ఖాన్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్డీ. ఖలీల్ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నరసింహారావు, మండల ఉపాధ్యక్షుడు ఈసం నర్సయ్య, యూత్ కార్యదర్శి ఎమ్డీ. గౌస్ పాషా తదితరులు పాల్గొన్నారు.

● ములుగు రూరల్ : మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆలిండియా ఆదివాసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు మంకిడి రవి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పార్టీలకు అతీతంగా ప్రజలందరి సంక్షేమం కోసం పాటుపడే సీతక్కను విమర్శించే స్థాయి కౌశిక్‌రెడ్డికి లేదని పేర్కొన్నారు. బహిరంగ క్షమాపన చెప్పకపోతే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

● మంగపేట: మంత్రి సీతక్కపై అహంకారంగా మాట్లాడిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరామిరెడ్డి అధ్యక్షతన మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ పూజారి సురేందర్‌బాబు, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, బీసీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాటబోయిన నర్సింహరావు, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొడేల నరేష్, మంగపేట సహకార సంఘం డైరెక్టర్ నర్ర శ్రీధర్, రైతు సమన్వయ సమితి మాజీ జిల్లా నాయకుడు పచ్చ శేషగిరిరావు, మాజీ ఆత్మ చైర్మన్ పగిడిపల్లి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల మండల బాధ్యులు చాద మల్లయ్య, గాదే శ్రవణ్‌కుమార్, హిదయతుల్లా, తాతినేని హరికృష్ణ, వీర్ల రఘునాథశ్రీను, సంగే కోటి, లక్రి ప్రశాంత్, బాడిశ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

వెంకటాపూర్(రామప్ప), జూలై 30: వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీశ్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేపట్టారు. ముందుగా ఆయన స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించి కేసుల నమోదు స్థితిగతులను తెలుసుకుని పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలన్నారు. బాధిత వ్యక్తుల నుంచి ఫిర్యాదును స్వీకరించిన అనంతరం వారికి వెంటనే రశీదు అందించాలని, ఎఫ్ఐఆర్ నిష్పక్షపాతంగా నమోదు చేయాలన్నారు. రిసెప్షన్ డ్యూటీలో ఫిర్యాదుదారుడి పట్ల మర్యాదగా ప్రవర్తించాలని అన్నారు. నేర పరిశోధనలో ఇన్వెస్టిగేషన్ అధికారి సాక్ష్యాధారాలను సేకరించడంలో నైపుణ్యంగా వ్యవహరించాలని, గ్రామ పోలీస్ అధికారి గ్రామంలోని ప్రజల సమస్యలను తెలుసుకుని ఎప్పటికప్పుడు స్టేషన్ హౌస్ అధికారికి తెలియజేయాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో నమోదుకాని, వదిలేయబడిన వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ములుగు డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్, స్థానిక ఎస్సై సతీష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.